పల్లెల్లో నాటక ప్రదర్శన జరుగుతోంటే సాధారణంగా ప్రేక్షకులూ, నటులూ కలిసి జీవించేస్తారు. పల్లె విడిచిపోయిన వారికి ఏదో రోజున తామేంపోగొట్టు కున్నారో తెలిసిరాక మానదు!

# శ్రీకృష్ణ విలాస సంఘానికీ జై!

గునుపూడి గ్రామం చిన్నదైనా, కళాకారులకీ, కళాపోషకులకీ లోటు లేదు. ఆ వూళ్లో దినదిన ప్రవర్ధమానమౌతున్న రాంభజన సంఘాలూ, హరికథా కాలక్షేపాలూ, తోలు బొమ్మలాటలూ దానికి సాక్ష్యంగా నిలుస్తాయి. బందా, పీసపాటి, ఈలపాట రఘురామయ్య వంటి మహామహుల నాటకాలకి కూడా అప్పుడప్పుడూ అక్కడి రాజపోషకుల ఆదరణ లభిస్తూంటుంది. ఈ మధ్య ఊళ్లో నటులే ఓ నాటక సమాజం స్థాపించి, చక్కని నాటకాలాడడం మొదలు పెట్టారు. దాని పేరే 'శ్రీకృష్ణ విలాస సంఘం!'

నాటక సమాజం స్థాపించారని ఒక్కమాటలో చెప్పేశాను గాని, దానిని సక్రమంగా నాలుగు కాలాలపాటు నడిపించడం మాటలతో పనా?! ఇల్లలకగనే పండగ కాదు గదా! నాటకం వేయాలంటే రంగస్థలం కావాలి. దానికి కావలసిన స్థలం కరణంగారి నర్థిస్తే, వారి బీడులో ఊరు వార భాగం దానపట్టా రాసిచ్చేసేరు. ఆ స్థలంలో డ్రామా హాలు తయారైంది. ముందు భాగంలో ఎత్తుగా మట్టిపోసి స్టేజి కట్టారు. ఎదురుగా హార్మోనిష్టుల తొక్కిడు హార్మోనీతో సహా కూర్చునేందుకు పెద్ద గొయ్యి, దానికి వెనక ప్రక్కగా నేల, చాప, బెంచీలు, తరగతుల వారీగా కూర్చోడానికి ఏర్పాట్లు - ఎలాగైతేనేం చక్కని హాలు తయారైంది. తొక్కుడు హార్మోనీ కొనడానికి తుని వెళ్ళినవాళ్లే నాలుగు పెట్రోమాక్సు లైట్లు కూడా కొనుక్కొచ్చారు. అన్నట్లు గునుపూడికి కరెంటు లేదు. రెండు లైట్లు స్టేజి మీదకి, రెండేమో గ్రీనురూముకి. ఇహ తెరలు రాయించవలసి ఉంది. ఓ పేరు మోసిన ఆర్టిస్టుని తెనాలి నుంచి పిలిపించి, ఒకటి రాజ దర్బారు సీనూ, మరోటి అరణ్యం సీనూ రాయించారు. ముందు తెరకి నీలం రంగు పల్చని సిల్కు గుడ్డకొని దాని మీద 'శ్రీకృష్ణ విలాస సంఘానికీ జై' అని రాయించారు.

మొట్టమొదటిసారిగా 'పాండవోద్యోగ విజయాలు' నాటకం వెయ్యడానికి నిశ్చయం అయింది. రిహార్సల్సు మొదలయ్యాయి. గునుపూడిలో ఆ మాత్రం గొంతెత్తి పాడగల ప్రతి కుర్రాడూ నటుడే. అందువల్ల నటుల కోసం వెతుక్కోనక్కరలేదు. అందరూ పుస్తకాలు చదవడం రాకపోయినా, వినికిడిని బట్టి నేర్చుకుని డైలాగులూ, పద్యాలు పొరబడకుండా చెప్పేయ గల సామర్థ్యం ఉన్నవాళ్లే!

మునసబు గారబ్బాయి 'చిట్టిబాబు' హార్మోనిష్టుగా కుదిరాడు. కృష్ణుడి వేషం కరణం గారబ్బాయికి తప్పదాయె! నటులందరికీ కిరీటాలు డిజైను చేస్తాడు గాబట్టి శరభయ్యకి అర్జునుడి వేషం. ఇలా అందరూ తలోటీ సర్దుకున్నారు. మేకప్పుకి ఎవరూ అక్కర్లేదు. కొంచెం, క్రేపు, హెయిరూ, స్పిరిటు గమ్మూ, కృత్రిమ క్రేప్, క్రీము కొని తెచ్చారు. ఎవరి కోటా వాళ్లే కొట్టేసుకోడం, నాటకాలకి డైరక్టరంటూ ఎవరు ఉండరు. ఎవరి డైరక్షన్ వాళ్ళదే! మంగలి నారాయణది మాత్రం పెట్రోమాక్సులైట్ల మేనేజిమెంటు. మరెవరికి అవి వెలిగించడం రాదు మరి! అదో పెద్ద అర్టు.

సంకురాత్తిరి నాడు రాత్రి పదింటికి, 'అదుగో ద్వారక....'తో ఆరంభం అయిన నాటకం, రండో ఇంటికి బోదమేల....' అంటూ పూర్తయ్యే సరికి కనుమ పండగొచ్చి తెల్లారిపోయింది. శ్రీరాగం, కళ్యాణి, మోహన వంటి రాగాలతో హాలు దద్దరిల్లిపోయింది. అప్పారావు భీముడుగా గొప్పగా ఒప్పించేసేడు. స్టేజీ అంతా గదతో దున్నేసేడు. ఒన్నుమోర్లు సరేసరి. ఇంకా ఉద్యోగానికీ, విజయానికీ మధ్యలో సుర్ల రామ్మూర్తి మొద్దబ్బాయి వేషం చూసి తీరవలసిందే! మొత్తం మీద 'శ్రీకృష్ణ విలాస సంఘం' ఆడిన మొదటి నాటకం గుమ్మెత్తి పోయింది. దానితో తాలూకాలో గునుపూడికి పెద్ద గుర్తింపు వచ్చింది.

ఇది జరిగిన చాలా సంవత్సరాలకి 'శ్రీకృష్ణ విలాస సంఘం' మూడు నాటకాలూ, ఆరు అంకాలుగా వర్ధిల్లుతున్న రోజుల్లో నేను సెలవులకి గునుపూడి వెళ్లడం తటస్థించింది. నేనుండేది హైదరాబాదులో. అవి శ్రీరామనవమి ఉత్సవాల రోజులు. ఆఖరి రోజున సమాజం వారి నాటకం ఉంది. భలే రంజుగా ఉంటుంది రమ్మని నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించారు ఊరి పెద్దలు. ఊళ్లో నా పలుకుబడికి తగ్గట్టుగా ముందు భాగంలో ఉన్నత ఆసనమే ఇచ్చారు. కానీ, ఎబ్బెట్టుగా ఉంటుందని, ఆ కుర్చీ తీయించేసి, హాలు మధ్యగా చాప మీద అందరితో పాటు నేనూ కూర్చున్నాను. అదే మంచిదయింది!

చందకాపూ, మందకాపూ పూర్తిచేసుకుని, పశువుల్ని కట్టి, గడ్డి వేసి, ఎవరి హరికేన్ లైట్లు వాళ్లు పట్టుకొచ్చి హాల్లో కూర్చుంటున్నారు ఒక్కొక్కరూ. రాత్రి పది గంటలకల్లా హాలు జనంతో కిటకిటలాడుతోంది. ముందుగా వచ్చిన వాళ్ళకి కూర్చుని కూర్చుని విసుగు పుడుతోంది. అప్పటికే చుట్టపొగలు మేఘాల్లా హాలు పైకప్పుని నింపేశాయి.

"ఇక మొదలెట్టండెహె! సగం రాత్రయిపోయింది" అన్నాడొకడు.

"అప్పుడే ఎక్కడ? పెద్దనాయుడింకా రాందే!" అన్నారెవరో.

ఇంతలో కాడిలాంటి చుట్ట నోటబెట్టి గుప్పు గుప్పున పొగవదుల్తూ, యమధర్మరాజులా హాలులోకి ప్రవేశించాడు పెద్ద నాయుడు. అంతే! హాలులో గోల తగ్గింది. ఆయన ఊళ్లో మోతుబరి. లేబరు లీడరు. ముందు లైనులో వందిమాగధుల్తో సహా నాయుడు కూర్చోగానే, తెరవెనక పళ్లెంలో హారతి కర్పూరం వెలిగించి ప్రార్థన మొదలు పెట్టారు. పల్చని తెర వెనక వెల్తురులో చూచాయగా నటుల శరీరాలు కనబడుతున్నాయి.

*పారా బ్రెమ్మ! పారా మేస్వర!*
*పురూ సోత్తమ! సదానందా!*
*పారం జోతి! పరమ పూరుష!*

ప్రార్థన పూర్తయింది. "జై! శ్రీకృష్ణ విలాస సంఘానికి జై" అన్న జేజే కారాల మధ్య కొబ్బరికాయ కొట్టారు.

తెరవెనక కోలాహలం తగ్గగానే ఓ పెద్దామన స్టేజి మీదకొచ్చి నాయుడిని మాట్లాడ వలసిందిగా ఆహ్వానించాడు. నోట్లోని చుట్ట పక్కన పెట్టి, తుపుక్కున ఉమ్మి, స్టేజి ఎక్కి ఉపన్యాసం మొదలెట్టాడు నాయుడు.

"గునుపూడి పెజలు యావన్మందికీ మనవి సేసుకునే దేమంటే, మన నాటక సంగం ఎంతకాలంగానో నాటకాలాడతా వుంది. మన వూల్లో అడే నాటకాలు జిల్లాలోనే పేరెల్లి పోయేయి. ఈ రోజు మన నాటకం సూత్తానికి పక్కవూల్ల జనం కూడా వొత్తన్నారంటే దానికిదే పెమాణం. ఇంతే కాకుండా అప్పుడప్పుడూ మనం కిరాయి నటుల్ని తెప్పించి కూడా నాటకాలాడిత్తన్నాం అని మనవి సేసుకుంటున్నాను. ఇంత పేరు తెచ్చుకున్న మన సంగానికి గ్రాంట్లు గూడా ఇప్పించవలసిందని గవర్నమెంటును కోరడమైంది. ఇయ్యాల మనం ఆడబోయేది సచ్చె - అరిచంద్రాయం నాటకం. ఇందులో అరిచెంద్రుడు మన అప్పారావే! పోతే సెంద్రమతి ఏసం గట్టే సీమతి వసుందరని కూడా మీరంతా ఎరుగుదురు. ఆవిడ పాట, ఏక్సనూ కన్నాంబకీ, నీరంజనికీ తీసిపోదని పెద్దల అభిప్రాయం....."

నా పక్కన ఎవరో కిసుక్కున నవ్వినట్టనిపిస్తే ఇటు చూశాను.

"కొయ్! కొయ్!" అన్నాడు మెల్లగా నా పక్కన కూర్చున్న కుర్రాడు.

"వసుందరంటే. మన గంగులమ్మే గదా?' అడిగాడొకడు.

"ఆc! ఆయమ్మే! ఈయన గారి ఇలాకా గదా! అందుకే మరీ ఉన్నయ్యీ, లేనియ్యీ కలిపి కోసేత్తన్నాడు నాయుడు" మరొకరు.

"ష్! మీ బాగోతం కట్టి పెట్టండెహె!" మందలించాడో ముసిలాయన.

నా ధ్యానం స్టేజి వైపు మళ్లింది.

"......కనక మీరంతా నిశ్శబ్దంగా వుండి నాటకం సూసి ఎల్లాలని నాను కోరు కుంటున్నాను. సెలవు" అని స్టేజి దిగాడు నాయుడు.

గడగడమని శబ్దం చేసుకుంటూ, వెదుళ్లతో వేలాడగట్టిన తెర పైకి లేచింది. ఇంద్రుడి దర్బారు సీను. హైస్కూలు నుంచి తెప్పించిన హెడ్మాస్టరి కుర్చీ ఇంద్రుడి సింహాసనంగా అమరింది. ఇటూ, అటూ, బెంచీల మీద పదో క్లాసు కుర్రాళ్లలా, వసిష్టుడూ, అతని బృందమూ, విశ్వామిత్రుడూ, అతని బృందమూ ఆసీనులై ఉన్నారు. సత్య వాక్పాలన మీద చర్చ మొదలయ్యింది. విశ్వామిత్రుడి కోపం అంచెలంచెలుగా పెరిగిపోతోంది. గట్టిగా ఓ పద్యం చెప్పేసరికి ఓ పెట్రొమాక్సు లైటు ఆరిపోయింది. ఎప్పుడో సాయంత్రమనగా వెలిగించారాయె. మంగలి నారాయణ గడగడా ఓ స్టూలు తెచ్చి వేసి, దాని మీదెక్కి లైటు క్రిందకి దింపి చూసి, "కిరసనాయిలయిపోయింది" అన్నాడు. ఎవరో ఒక్క అంగలో వెళ్లి హాలు పక్కనున్న వెంకన్న ఇంట్లోంచి ఓ సీసా కిరసనాయిలు తెచ్చారు. అది పోసి, లైటు వెలిగించి యధాస్థానంలో పెట్టాడు నారాయణ. నాటకం మళ్లీ మొదలు పెట్టారు.

ఈ హడావుడిలో విశ్వామిత్రుడు చదవ్వలసిన రెండు పద్యాలు వరసగా వసిష్ట పాత్రధారి చకచకా చదివేశాడు. విశ్వామిత్రుడు కోపంతో రెచ్చిపోయి కుప్పిగంతు లేయడం మొదలుపెట్టాడు. హాల్లో కలకలం బయల్దేరింది.

"ఎదవ సచ్చినోడు! రేవు కాణ్నించి తిన్నగా హాలు కొచ్చి ఏసం కట్టేసినట్టున్నాడు. లేపోతే డోసు ఎక్కువైందో ఏమో! ఆడి పజ్జెం ఈడు చెప్పడమెందుకు?" అన్నారొకరు.

"పోనీ! పజ్జెం ఎవరిదైతేనేం? కళ్యాని ఈడు పాడినంత బాగా ఆడు పాడగలడేటి? నానైతే ముందే జెప్పేను. ఇస్వామిత్రుడి ఏసం సాకలి రాముడికే ఇవ్వండని. నా మాటింటేనా? వసిస్టుడు నాకొద్దో అంటున్నా ఆడికి అంటగట్టేరు. బాగా అయింది" నసిగాడు ఇంకొకడు.

ఎలాగోలాగ దర్బారు సీను అయిందనిపించారు. తర్వాత నక్షత్రకుడొచ్చే వరకూ ఏ ప్రమాదమూ జరగలేదు. నక్షత్రకుడు హరిశ్చంద్రుణ్ని కష్టపెట్టే సీనులో నక్షత్రుడికి కష్టాలు మొదలయ్యాయి. వాడు పాడే ప్రతీ పద్యానికీ హార్మోనిస్టు తప్పుడు మెట్లు నొక్కేస్తున్నాడు. నక్షత్రకుడు కల్యాణి ఎత్తుకుంటే ఈయన మోహన అందిస్తున్నాడు. దానితో నక్షత్రకుడు స్టేజి ముందుకొచ్చి కోపంగా హార్మోనిస్టు వేపు చూస్తూ గొంతెత్తి చేతులూపుతూ పాడడం మొదలెట్టాడు. చూసేవాళ్లందరికీ సీను చప్పగా ఉంటోంది. పద్యాలు రక్తి కట్టడం లేదు.

నా ప్రక్కన కూర్చున్న వాళ్ల గుసగుసల్లో అసలు రహస్యం బైటపడింది. మొదట్లో నక్షత్రకుడి వేషం హార్మోనిస్టు తమ్ముడిదట. వాడిని తీసేసి వీడికిచ్చారని హార్మోనిస్టుకి గుర్రుగా ఉంది. అంచేత వాడి పాటనంతటినీ నాశనం చేస్తానని ఒట్టుపెట్టుకున్నాడు.

ఇలా పడుతూ లేస్తూ సీన్లన్నింటినీ గట్టెక్కించి, ఇక తెలతెలవారుతోందనగా కాటిసీను వరకూ లాక్కొచ్చారు.

ఆఖరి సీనులో హరిశ్చంద్రుడూ, చంద్రమతీ అద్భుతంగా నటిస్తారు. అందుకోసమే అందరూ ఎదురు చూస్తున్నారు. హరిశ్చంద్రుడు ప్రవేశించి 'మాయామేయ జగంబె నిత్యమని సంభావించి...' పద్యం పూర్తి చేసేసరికి ఒక వన్సుమోర్ వచ్చింది. ఇంతలో లోహితాస్యుణ్ని భుజం మీద వేసుకుని ఏడుస్తూ ప్రవేశించింది చంద్రమతి.

"కొడుకా! నా కొడుకా! నీ కప్పుడే నూరేళ్లు నిండాయా!" అని డైలాగులు చెప్పుతోంది. ఆమె ఇంకా పాట అందుకోనేలేదు. ఇంతలో ప్రేక్షకుల్లో ఒకరు ఆమె నటనని మెచ్చుకుని రూపాయి నోట్ల దండ ఒకటి అమాంతం స్టేజి ఎక్కి ఆమె మెడలో వేశాడు. ప్రేక్షకుల్లో చప్పట్లు మిన్ను ముట్టాయి. ఆవేశంతో ఆమె ఒక విషాదగీతం ఆలపించింది. వెనక నుంచి ఇంకొకరు వచ్చి మరో రూపాయి హారం ఆమె మెడలో వేశారు. ఈ గోలకి నిద్రపోతున్న లోహితాస్యుడు లేచి కూర్చుని, "అమ్మా!" అని ఏడుపు లంకించుకున్నాడు. చంద్రమతికి ఇంకా ఓ పాట బాకీ ఉంది. రెండు దండలు పడవలసి ఉన్నాయి. కనుక లోహితాస్యుణ్ని నెమ్మదిగా ఓదార్చి పడుకోబెట్టే బాధ్యత హరిశ్చంద్రుడు తీసుకున్నాడు. వాణ్ని జోకొట్టి లేవకుండా పట్టుక్కూచున్నాడు. మరో మూడు పజ్జాలు, నాలుగు దండల్తో చంద్రమతి తన ప్రతిభని ప్రదర్శించి ఆయాసం తీర్చుకోడానికి ఆగింది.

గునుపూడిలో కళాకారులే గాక, ఇంతటి కళారాధకులు కూడా ఉన్నారని తెలిసి ఆశ్చర్యపోయాను. నా వెనకనున్న ప్రేక్షకుల్లో కొందరు పెద్దనాయుడే ఇలా నలుగురికీ దండలు ఇచ్చి పురమాయించాడని గునుస్తూండడం వినిపించినా నమ్మాలనిపించలేదు.

ఇంక హరిశ్చంద్రుడు రెండు డైలాగులు చెప్పి పజ్జాలు పాడవలసి ఉంది. కూర్చుని ఉంటే పాడడం కష్టం కనుక, "పడతీ! ఎవ్వతెవీవు?" అని పద్యం అందుకుని, నెమ్మదిగా లేచి, లోహితాస్యుడిని చూసుకోమని చంద్రమతికి సంజ్ఞ చేశాడు. చంద్రమతి వెళ్లి లోహితాస్యుడు లేవకుండా పట్టుకుంది. హరిశ్చంద్రుడి మొదటి పద్యానికే నాలుగు ఒన్సుమోర్లు వచ్చాయి. అతడు మందహాసంతో స్టేజి ముందుకి వచ్చి అదే పద్యం మళ్లీ పాడాడు. హరిశ్చంద్రుడు, "దశమే పయ్యెదలో నడుంగియు" పద్యం చదువుతూంటే హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి చంద్రమతి గుండెల దగ్గిర దాచుకున్న బ్యాటరీ మీట నొక్కింది. అప్పుడు వెలిగాయి రెండు బల్బులు మంగళసూత్రాల్లా! జయ జయధ్వానాలతో హాలు మారుమ్రోగింది. ఒన్సుమోర్లు భరించలేక సభకి నమస్కరించి ఇలా ఉపన్యసించాడు హరిశ్చంద్రుడు:

"ఈ నాటకం సూడ్డానికి వొచ్చిన పెజలందరికీ నమస్కారాలు. నేనీ అరిచ్చెంద్ర ఏసం ఎనిమిది సంవత్సరాలుగా కడతన్నాను. ఎందరో పెద్దలు ఇంత బాగా అరిచ్చెంద్ర ఏసం ఒప్పించిన నటులు లేరని పొగిడారు. రెండేళ్ల కిందట సంవత్సరాదికి 'బొడ్డేపల్లి'లో నా ఏసానికి మెచ్చి సమితి పెసిడెంటుగోరు బంగారు పతకం ఇచ్చేరు" అని ఓ పతకం తీసి చూపించాడు. "కిందటేడు నర్సీపట్నంలో నా అరిచ్చెంద్ర నటనని మెచ్చుకుని బుల్లి దొరగారు 'వెండికత్తి' బహూకరించారు' అని చేతిలో కత్తి ఝుళిపించి చూపాడు. "మీ అందరి అభిమానం ఉంటే ఇంకా చాలా ఏళ్లు ఇలాగే నాటకాలాడాలని వుంది. మీలో ఎవరైనా, అరిచ్చెంద్ర నాటకం ఆడాలంటే నాకు ఉత్తరం రాయొచ్చు. 'గునుపూడి అప్పారావు, బస్సుస్టాండు ఎనకాల ఇల్లు, గునుపూడి' అని రాస్తే చాలు" అని పూర్తి చేశాడు.

అటు తిరిగి వెళ్ళి మళ్లీ, "దళమేపయ్యెద" పద్యం చదివాడు. ఈలోగా బ్యాటరీ అయిపోయి బల్బులు వెలగడం మానుకున్నాయి.

నెమ్మదిగా సీను ముందుకు జరిగి, దేవతలంతా దివి నుంచి భువికి దీవించడానికి దిగివచ్చే సరికి తెలతెలవారుతోంది. లోహితాస్యుడితో బాటు ప్రేక్షకుల్లో చాలామంది ఆడాళ్లు గుర్రుపెట్టి నిద్దరోతున్నారు. మొగాళ్ళు పొలాల్లో పశువులకి మేత వేసుకోవాలని తొందరపడు తున్నారు. తూర్పుకొండ అంచుల మీద బాలభానుడు ఉదయించడానికి తొందరపడు తున్నాడు.

ఈ లోకంలోకి వచ్చిన నేను తెల్లవార్లూ నాటకంలో ఎలా నిమగ్నమై పోయానా అని ఆశ్చర్యపోయాను.

నేను గునుపూడిలోనే పుట్టి, పెరిగిన వాడిని. ఉద్యోగం, పురోభివృద్ధి మిషగా దేశదిమ్మరినై నేనేం పోగొట్టుకున్నానో ఇప్పుడు తెలుసుకున్నాను. ✷